క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 14వ వార్డులో పారిశుధ్య పనులను కమిషనర్ వెంకటరమణయ్య పరిశీలించారు. మంగళవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆయన వార్డులో పర్యటించారు. ఇంటింటా చెత్తసేకరణ గురించి ప్రజలను ఆరాతీశారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్మికులను ఆదేశించారు.

బ్యాంకులో వివరాలు అందజేయాలి

గుత్తి: గుత్తి ఏడీసీసీ పరిధి కింద ఉన్న కిష్టిపాడు, తొండపాడు, మాముదూరు వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారందరూ ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులను అందజేయాలని గుత్తి ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ జానకిరామిరెడ్డి కోరారు.ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్యులందరూ తప్పకుండా తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాలతో పాటు రెండు ఫోటోలను తీసుకుని గుత్తి ఏడీసీసీ బ్యాంకులో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్‌లో ఉన్న పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రం, శుద్ధ ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

నేడు జలహారతి

గుంతకల్లుటౌన్: సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లోకి హంద్రీనీవా ద్వారా విడుదలైన నీటి పంపింగ్‌ను ప్రారంభించేందుకు బుధవారం ఉదయం జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటరమణయ్య పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు హాజరు కావాలని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

వైద్యుల నిరసన



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

తాడిపత్రిటౌన్: కలకత్తాలో ఓ వైద్యురాలిని హత్య చేయడం దారుణమని వైద్యులు ముక్తకంఠంతో నిరసించారు. మంగళవారం స్థానిక వందపడకల ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ దేవిండ్ సెల్వరాజన్, సీఎస్ఆర్ఎంఓ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు ఇజ్‌దాని మాట్లాడుతూ వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. నిందితును కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాయిచరణ్, భగీరథ, వసీమ్, నాగార్జున, పవన్, మధులత, వాసంతి, జాహ్నవి, మంజుల, సౌజన్య, ఉషా, సాభా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం




డెంగీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యాడికి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని రాయలచెరువు నంబర్.2 సచివాలయ పరిధిలో మంగళవారం డెంగీ, మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు, గుంతలు, పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. రాత్రిపూట దోమ తెరలను ఉపయోగించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించా లన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా నర్సరీలు

- నాసిరకం నారుతో నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ఉద్యాన శాఖ అధికారులు



గార్లదిన్నెలో ఏర్పాటు చేసిన నర్సరీలు (ఇన్‌సెట్‌లో టమాట నారు)

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా అనుమతి లేని నర్సరీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ నర్సరీల్లో నిర్వాహకులు నాసిరకం మొక్కలు (నారు) రైతులకు ఇస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో నర్సరీల్లో టమాట, మిరప, వంకాయ, బంతిపూలు వంటి నారును కొనుగోలు చేసి నష్టపోయిన రైతులు ఉన్నారు. నర్సరీలను పర్యవేక్షించే ఉద్యాన శాఖ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు లేకపోలేదు. దీంతో నర్సరీలు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 80 వరకూ నర్సరీలు ఉన్నాయి. అందులో గార్లదిన్నె మండలంలోనే దాదాపు 30 నర్సరీలు వెలిశాయి. మండల వ్యాప్తంగా గత పదేళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు టమాట, మిరప, వంటి కాయగూరల పంటలు సాగు చేస్తున్నారు. ఏటా మండలంలో దాదాపు 10 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లలో నీరు తగ్గడం, బావులు ఎండిపోవడం, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో రైతులు తక్కువ నీటితో పండించే కాయగూరల పంటల సాగుపై దృష్టి సారించారు. దీంతో ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో కూరగాయల నారు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు నర్సరీ వ్యాపారులు నాసిరకం నారును విక్రయిస్తూ నష్టపెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నకిలి విత్తనాలు, నార్ల విక్రయాలపై రైతు సంఘం నాయకులు, రైతులు ఆందోళనలు సైతం చేశారు. ప్రతి సంవత్సరం రూలక్షల్లో వ్యాపారం సాగిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నర్సరీలను ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షించకుండా మాముళ్ల మత్తులో ఉన్నారని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

నియోజకవర్గంలో నర్సరీల వివరాలు	
మండలం	నర్సరీలు
గార్లదిన్నె	25
శింగనమల	22
యల్లనూరు	00
బుక్కరాయసముద్రం	02
పుట్లూరు	03
నార్పల	25

నర్సరీ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే ఉద్యానశాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నర్సరీలు ఏర్పాటు చేసేవారు పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులో ఎలాంటి రకం ఉద్యాన మొక్కలు పెంచుతున్నారో తెలపాలి. రిజిస్ట్రేషన్ కోసం నర్సరీ ఏర్పాటు చేసే భూమి వివరాలు, నర్సరీ స్టాక్, ఆధార్ కార్డు, యాజమాని ఫోటో, రూ.1000 చలానా చెల్లించాల్సి ఉంటుంది. అయితే నియోజకవర్గంలో చాలా మంది వ్యాపారులు అనుమతులు తీసుకోకుండానే నర్సరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నర్సరీల్లో నాసిరకం టమాట, మిరప, ఇతర కూరగాయల మొక్కల నారు విక్రయిస్తూ లక్షలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు ఏటా పంటలు నష్టపోతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అలాగే అనుమతి తీసుకుని నర్సరీ నిర్వహిస్తున్న వ్యాపారులు కూడా మూడు సంవత్సరాలుకు ఒక సారి రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసుకోవాలి. కొంత మంది ఒకసారి అనుమతి తీసుకొని రెన్యూవల్ చేసుకోకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు స్పందించి అక్రమ నర్సరీలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాసిరకం నారుతో రైతులకు నష్టం



నర్సరీల్లో నాసిరకం నారు రైతులకు విక్రయిస్తుండంతో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నాం. గార్లదిన్నె మండలంలో ఉన్న నర్సరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. నాసిరకం విత్తనాలు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు ఉద్యాన శాఖ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. అక్రమ నర్సరీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– చెన్నారెడ్డి, రైతు, జంబులదిన్నె

చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నర్సరీలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. నాసిరకం కూరగాయాలు మొక్కల నారు విక్రయిస్తున్న నర్సరీల లైసెన్స్ రద్దు చేస్తాం. నాసిరకం విత్తనాలు వల్ల నష్టపోయిన రైతులు ఫిర్యాదు చేస్తే ఆ నర్సరీలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– రత్నకుమార్, హార్టికల్చర్ ఆఫీసర్

పంచాయతీల్లో సంపద సృష్టించుకోవాలి



శింగనమల మండలం కల్లుమడిలో వర్మి కంపోస్టు తయారీపై శిక్షణ ఇస్తున్న అధికారులు

శింగనమల/బుక్కరాయసముద్రం/పుట్లూరు/గార్లదిన్నె/ పెద్దవడుగూరు/పామిడి/: గ్రామ పంచాయతీల్లో వనరులను సద్వినియోగం చేసుకుని సంపద సృష్టించుకోవాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి సూచించారు. సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు మంగళవారం శింగనమల మండలంలోని కల్లుమడి గ్రామ పంచాయతీలోని చెత్త సంపద కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ వర్మి కంపోస్టు ఎరువు తయారు చేసి, రైతులకు విక్రయించి ఆదాయం పొందవచ్చాన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ దామోదరమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు. పుట్లూరులో ఎంపీడీఓ యోగానందరెడ్డి , ఈఓఆర్డీ ఆనంద్ తదితరులు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గార్లదిన్నె మండలంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పామిడి మండలంలోని పొళ్యం గ్రామంలో వర్మీ కంపోస్ట్ తయారీపై ఈఓఆర్డీ బీవీ శశికళ ఆధ్వర్యంలో సర్పంచులకు రెండోరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కే నారాయణరెడ్డి, నారాయణస్వామి, సెక్రెటరీ సత్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్

పామిడి: గిరిజనులు చట్టపరమైన తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి, సెక్రటరీ కమ్ సివిల్ జడ్జి జీ శివప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని పొళ్యం తండాలో అనంతపురం జిల్లా న్యాయ సేవల అథారిటీ, జిల్లా వైద్య ఆరోగ్యం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. హక్కులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతకుముందు ఆయన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఓపీ-204, ల్యాబ్ టెస్టులు-192, ఐ టెస్టింగ్‌లు-9, ఈసీజీ-9, రెఫర్-1 చొప్పున గిరిజనులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్‌నాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుజాత, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, డీపీఎంఓ డాక్టర్ రవిశేఖర్, రవిశేఖర్, వైద్యులు ఉదయార్క, మంజుల, ఏపీఎం అరుణ, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో రైతులకు ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: వ్యవసాయంలో యాంత్రీకరణ రైతులకు ప్రయోజనకరమని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని రేకులకుంటలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్ వారు రూపొందించిన రైజ్ బెడ్ ప్లాంటర్, హర్బీసైడ్ అప్లికేటర్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సులభతరంగా వ్యవసాయం చేయడంలో యాంత్రీకరణ ఎంతో అవసరం అన్నారు. నూతన గొర్రు ప్రాముఖ్యతను వివరించారు. యాంత్రీకరణ వలన కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం నూతన గొర్రుపై వ్యవసాయ ఇంజినీర్ డాక్టర్ భాస్కర్ రావు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి, నటరాజ, లక్ష్మన్, మాధవీలత, లక్ష్మీ కళ్యాణి, దుర్గాప్రసాద్, నసీరుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి జి.మంజుల

గుంతకల్లు రూరల్: కేజీబీవీలో విద్యార్థులకు వడ్డించే ఆహారం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయసేవాధికార సమితి చైర్మన్ జి.మంజుల పాఠశాల సిబ్బందికి సూచించారు. హైకోర్టు సూచనల మేరకు మండల న్యాయసేవాధికార సమితి సభ్యులతో కలిసి మంగళవారం ఆమె స్థానిక దోనిముక్కలరోడ్డులోని కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం ఇతరత్రా వసతులపై ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, ఏఎన్ఎం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు దగ్గర్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు తీసుకెళ్తున్నారని విద్యార్థినులు తెలిపారు. భోజనం తక్కువగా వడ్డిస్తున్నారన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడిన జడ్జి వెంటనే సమస్యలన్నింటికీ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు బాబా తాజుద్దీన్, కోర్టు సిబ్బంది తదితరులు ఆమె వెంటున్నారు.

జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోపాల్

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీ శంకరనందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో భారత స్వాతంత్ర ఉద్యమం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చదువుతోపాటు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అంతేకాకుండా ఉద్యమ స్ఫూర్తిని అలవరుచుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, కళాశాల పర్యవేక్షకుడు రాఘవేంద్ర, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గోపీ, వెంకటసుబ్బమ్మ భారతి, సైరాభాను, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు

పామిడి: ఉపాధ్యాయులకు సంబంధించి పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సమస్యల సేకరణ, ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సబ్జెక్టుల వారీ పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలను సమాంతరంగా నిర్వర్తించాలన్నారు. ఉపాధ్యాయులకు శరాఘాతంగా మారిన జీఓ 117 రద్దు చేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండునెలలు గడిచినా విద్యాశాఖామంత్రి ఉపాధ్యాయ సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయకపోవడం , ఉపాధ్యాయుల పనిభారం తగ్గకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రామాంజనేయులు, వీ చంద్రశేఖర్, జిల్లా నాయకులు ఏ నాగభూషణం, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం



గుంతకల్లులో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



గుంతకల్లులో భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పంద్రాగస్టు రోజున ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని హర్ ఘర్ తిరంగా కార్యక్రమ జోనల్ ఇన్‌చార్జ్ కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. రైల్వే గ్రౌండ్ నుంచి మొదలైన ఈ యాత్ర మెయిన్‌రోడ్డు మీదుగా పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకూ సాగింది. నాయకులు మాట్లాడుతూ ఎందరో మహనీయుల పోరాట ఫలితంగానే భారతీయులంతా స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, హర్ ఘర్ తిరంగా ప్రోగ్రామ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు హరీష్‌రెడ్డి, జి.రాజేష్, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలో మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



శింగనమలలో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల: మండలంలో త్వరలో ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, మండల సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, విర్వోలు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా త్వరలో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ ఓబిలేసు సూచించారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో వీఆర్ఓలతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి, రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. భూ ఆక్రమణలు, సెక్షన్ 22-ఏ గురించి రైతులతో ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ లలిత, ఆర్ఐ సందీప్, వీఆర్ఓలు రంగయ్య, పవిత్ర, శివారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

వర్షం కోసం బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిసేకం చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వర్షం కోసం ప్రజలు బొడ్రాయికి జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వర్షం కురవాలని బొడ్రాయికి 101 బిందెల నీరు, అదేసంఖ్యలో టెంకాయలు, ఆకులు, వక్కలు, ఎర్రగడ్డలు, నిమ్మకాయలుతో సమర్పించి మొక్కులు తీర్చుకున్నామన్నారు.

రేపు రక్తదాన శిబిరం

గుత్తి: పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఈ నెల15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నబీరసూల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. యువతీ, యువకులు, ఆరోగ్యవంతులు రక్తదాన శిబిరానికి తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

నెట్టికంటుడికి కిలో వెండి వితరణ



ఈఓ భద్రాజీకి వెండి అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: పట్టణానికి చెందిన టి.శ్రీనివాసులు రెడ్డి, ఆయన భార్య అశ్విని మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి కిలో వెండిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మండల సమాఖ్య వార్షిక మహాసభ



మాట్లాడుతున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

పుట్లూరు: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం 21వ వార్షిక మహాసభ నిర్వహించారు. ప్రియదర్శిని మండల సమాఖ్య అధ్యక్షురాలు నల్లమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమాశంలో ఎంపీడీఓ యోగానంద రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు అభివృద్ధి చెందడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలోని అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్, వంద్రప్ప గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై బళ్లారి నుంచి వీరిద్దరూ అనంతపురం వెళ్తుండగా, మార్గంమధ్యలో కుక్క అడ్డు రావడంతో హఠాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కిందపడ్డారు. స్థానికుల సహాయంతో కూడేరులో చికిత్స పొందారు.